

వేగంగా పెండింగ్ కేసుల దర్యాప్తు

పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. మద్దిపాడు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు.

- 8లో..



షెడ్యూల్ తెగల అభ్యున్నతికి కృషి

షెడ్యూల్ తెగల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కె.రవిబాబు అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32 /21

వాతావరణం

పొగమంచు అధికంగా ఉంటుంది.
గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మార్కాపురం: మండలంలోని రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా రగ్బీ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపిక కమిటీ సభ్యులుగా రవిప్రసాద్‌రెడ్డి, రాజ్‌కుమార్, పెద్దన్న, నాగమణి వ్యవహరించారు

బాలుర జట్టు: అఖిలేష్, కార్తీక్, చరణ్‌తేజ, జాన్, వరుణ్‌తేజ, వీరభద్ర, సిద్ధార్థ, విజయ్‌కుమార్, సాయిచైతన్య, మోహన్‌కృష్ణ, స్టాండ్‌బైగా దుర్గారావు, కార్తీక్, శ్యాం అరుణేష్, పవన్‌కుమార్ రెడ్డి, ఎం.లక్ష్మీ నరసింహ

బాలికల జట్టు: లాస్య, శివరంజనీ, మహాలక్ష్మి, బ్లసీనా, సౌజన్య, వైష్ణవి, మనీషా, రిషిత, రాధిక, లోహిత, స్టాండ్‌బైగా ప్రసన్న లక్ష్మీ, జెస్సికా, భార్గవి, గీతిక, బ్యూలా, తులసీబాయి

బాలికల బంగారు భవితకు 'సుకన్య' ఖాతా

- పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ రమణయ్య

ఒంగోలు సబర్బన్: పోస్టల్ శాఖ అందిస్తున్న సుకన్య సమృద్ధి యోజన ఖాతా బాలికల బంగారు భవితకు దోహదపడుతుందని ప్రకాశం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్(ఎస్ఎస్‌పీ) డి.రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్‌పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సుకన్య ఖాతాకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో తపాలా శాఖ ఫిబ్రవరి 11 నుంచి 15వ తేదీ వరకు ఏఎంఆర్‌టీఐటీపీఈఎస్–2023 పేరుతో ఫిలాటలీ(స్టాంప్స్ సేకరణ) ఎగ్జిబిషన్‌ను న్యూఢిల్లీలో నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా అర్హత కలిగిన బాలికలందరికీ సుకన్య సమృద్ధి యోజన కింద నూతన ఖాతాలు ప్రారంభించాలని నిర్ణయించిందన్నారు. పదేళ్లలోపు వయసు కలిగిన బాలికల పేరు మీద తల్లిదండ్రులుగానీ, చట్టబద్ధ సంరక్షకులుగానీ ఖాతాను ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. రూ.250 ప్రాథమిక డిపాజిట్ నుంచి గరిష్టంగా రూ.1.50 లక్షలతో ఖాతా ప్రారంభించవచ్చన్నారు. ప్రస్తుతం సుకన్య ఖాతాలో పొదుపు చేసే నగదుపై 7.6 శాతం వార్షిక చక్రవడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. ఖాతాలో జమ చేసిన సొమ్ముకు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు వర్తిస్తుందన్నారు.

కిడ్నీ బాధితుల్లో కొత్త వెలుగులు





| మార్కాపురం డయాలసిస్ కేంద్రంలో.. |

జిల్లాలో కిడ్నీ బాధితులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఒక వైపు అత్యాధునిక వైద్య సేవలు చెంతకే తీసుకురావడం, మరో వైపు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో డయాలసిస్ కేంద్రాలు బాధితులకు అండగా నిలుస్తున్నాయి. అలాగే స్వచ్ఛ జలాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కనిగిరిలో రూ.400 కోట్లు, మార్కాపురంలో రూ.200 కోట్లు, పొదిలిలో రూ. 50 కోట్లతో సాగర్ నీటిని అందించేందుకు పనులు ప్రారంభించింది.

- అందుబాటులో అత్యాధునిక వైద్యసేవలు
- చెంతనే డయాలసిస్ కేంద్రాలు
- ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో సేవలు
- స్వచ్ఛ జలాలు అందించే దిశగా అడుగులు
- ప్రతి నెలా రూ.10వేల పింఛన్
- ఉచితంగా అంబులెన్స్ సేవలు

మార్కాపురం: కిడ్నీ బాధితులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపడుతోంది. వైద్య పరంగా వీరికి కీలకమైన డయాలసిస్‌ను ఉచితంగా అందిస్తోంది. గత టీడీపీ హయాంలో సుదూర ప్రాంతాలకు అవస్థలు పడుతూ వెళ్లి డయాలసిస్ చేసుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి చేరే వరకూ ఉచితంగా అంబులెన్స్ సేవలు అదిస్తోంది. డయాలసిస్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే చెంతనే కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సుమారు 43 యంత్రాలను అందుబాటులో ఉంచింది. రోజూ సుమారు 200 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచే కాకుండా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు నుంచి కూడా బాధితులు వైద్య సేవలు పొందుతున్నారు.

ఒంగోలులో...

ఒంగోలులో పెద్దాసుపత్రిలో డయాలసిస్ నెఫ్రోప్లస్ సెంటర్‌లో 16 మిషన్‌లు ఉన్నాయి. 11 మిషన్‌లు సాధారణ రోగులకు. మిగిలిన ఐదింటిలో హెచ్‌ఐవీ రోగుల కోసం ఒకటి, హెచ్‌సీడీ రోగులకు 2, హెచ్‌డీఎస్‌ఏజీ రోగులకు 2 మిషన్లు కేటాయించారు. క్రానిక్ హీమోడయాలసిస్ పేషెంట్లకు ఈ కేంద్రంలో డయాలసిస్ చేస్తారు. ప్రతి రోజూ 40 నుంచి 50 మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. అద్దంకి, చీమకుర్తి, కొండపి, సింగరాయకొండ, పొదిలి, ఒంగోలు ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు.

మార్కాపురంలో..

జిల్లా వైద్యశాలలో గణాంకాల ప్రకారం 78 మంది కిడ్నీ బాధితులు ఉన్నారు. బాధితుని ఆరోగ్య పరిస్థిని డాక్టర్‌లు పరిశీలించి డయాలసిస్ చేస్తారు. కేంద్రంలో ఐసీయూ బెడ్‌లతో పాటు 10 మిషన్‌లు ఉన్నాయి. డ్యూటీ డాక్టర్‌తో పాటు 10 మంది సిబ్బంది ఉన్నారు. ప్రతి పది రోజులకు ఒక సారి నెఫ్రాలజిస్టు వచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఇటీవల అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కిడ్నీ రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు ఉపయోగపడుతున్నాయి. ఇందులో పూర్తి ఆటోమ్యాటిక్ బయోకెమిస్ట్రీ మిషన్ ద్వారా ఎస్‌జీపీటీ, ఎస్‌జీవోటి, ప్లేట్‌లెట్స్, హిమోగ్లోబిన్ శాతం టెస్టులను చేస్తున్నారు. ఫలితాలు త్వరగా రావటం వల్ల వైద్యం వెంటనే ప్రారంభిస్తున్నారు. గతంలో ఈ పరీక్షలు మ్యాన్‌వల్‌గా చేసేశారు. పలితాలు వచ్చేటప్పటికీ ఆలస్యం అయ్యేది. ప్రస్తుతం ఈ ఇబ్బందులు తొలగాయి.

కనిగిరిలో..

పట్టణ పరిధిలోని ఆస్పత్రిలో డయాలసిస్ హెచ్‌డీ మిషన్లు 17 ఉన్నాయి. రోజుకు 50 మందికి డయాలసిస్‌ను నాలుగు విడతలు చేస్తున్నారు. కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల వారే కాకుండా దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి తదితర మండలాల నుంచి వచ్చే బాధితులకు సేవలందిస్తున్నారు.

పెరిగిన పింఛన్‌తో ఆసరా..

డయాలసిస్ చేసుకునే వారికి గత తెలుగుదేశ ప్రభుత్వం నెలకు కేవలం రూ. 2 వేలను మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంది. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత దానిని రూ. 10 వేలకు పెంచారు. వారికి ఠంఛన్‌గా పింఛన్ అందిస్తూ ఆర్థికంగా భరోసా నిస్తున్నారు.



మార్కాపురం జిల్లా వైద్యశాల

స్వచ్ఛ జలాల కోసం..

పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరిన్ నీరు ఎక్కువగా ఉండటంతో ప్రజల కిడ్నీలు పాడైపోయి డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. దీన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛనీటిని అందించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. సాగర్ జలాలను తీసుకువచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. మార్కాపురంలో రూ.200 కోట్లతో వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే పొదిలిలో రూ.50 కోట్లతో పొదిలి పెద్ద చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభించనున్నారు. కనిగిరి నియోజకవర్గం పరిధి ఆరు మండలాల్లోని 443 గ్రామాలకు రూ.400 కోట్లతో సురక్షిత జలాలు అందించేందుకు రంగం సిద్ధం అయింది. టెండర్లు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

ఠంచన్‌గా రూ.10 వేల పింఛన్



మార్కాపురం జిల్లా వైద్యశాలలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. ప్రతి నెల ఠంచన్‌గా రూ.10 వేల పింఛన్ అందుతోంది. డాక్టర్‌లు, సిబ్బంది నా ఆరోగ్యంపై వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు.

– ఎస్.పుల్లయ, యడవల్లి, దోర్నాల

బాగా చూస్తున్నారు



వారానికి ఒకసారి జిల్లా వైద్యశాలకు వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాను. సిబ్బంది బాగా చూసుకుంటున్నారు. పింఛన్‌తో పాటు మందులు కూడా ఇస్తున్నారు.

– లక్ష్మీదేవి, కంభం

రోగులపై ప్రత్యేక శ్రద్ధ



డయాలసిస్ రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. ఆదివారం మినహా ప్రతి రోజూ డయాలసిస్ చేస్తాం. మొత్తం 78 మంది రోగులు ఉన్నారు. వీరికి 1వ తేదీనే ప్రభుత్వం రూ.10 వేల పింఛన్ ఇస్తుంది.

– డాక్టర్ సుబ్బారెడ్డి, సూపరింటెండెంట్

నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాడు–నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలకు కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి అవసరాన్ని బట్టి సామాగ్రి ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు ఇవ్వాలన్నారు. దీని వల్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయచ్చన్నారు. దీనిపై ఎంఈఓ, మండల ఇంజినీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిర్మాణల పురోగతిని వారానికి ఒకసారి ఇంజినీరింగ్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఫొటోలు అప్‌లోడ్‌చేయాలన్నారు. నిర్మాణ పనుల బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్య పోర్టల్‌లో ఉంచాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాల ద్వారా కాకుండా సచివాలయాల ద్వారా జరిగేలా చూడాలన్నారు. సచివాలయాల సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీని వేగంగా పూర్తి చేయాలన్నారు. గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈఓపీఆర్డీ, ఎంపీడీఓలు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఉదయం రెవెన్యూ అంశాలపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఇళ్ల పట్టాలు ఆడిట్, సాదా బైనామాలు, ల్యాండ్ కన్వర్షన్, 22ఏ భూ సమస్యలు పరిష్కారంలో నిబంధనలు మేరకు పనిచేయాలన్నారు. రెవెన్యూ అంశాల్లో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈఓ విజయభాస్కర్, సచివాలయాల ఇన్‌చార్జ్ ఉషారాణి, డ్వామా పీడీ శీనారెడ్డి, పీఈఓ సామా సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.



సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన పేస్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్



జూనియర్స్ విభాగంలో విజేతగా కలెక్టర్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న పేస్ పాలిటెక్నిక్ జట్టు

సాక్షి ప్రీమియర్ లీగ్ విజేత 'పేస్'

- ద్వితీయ స్థానంలో నిలిచిన ఒంగోలు ట్రిపుల్ ఐటీ, చీరాల పాలిటెక్నిక్ కాలేజీ జట్లు
- విజేతలను మెమోంటోలు అందించి అభినందించిన కలెక్టర్

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

Regional sponsor

APMDC | APMDC FOUNDATION

ఒంగోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పేస్ కాలేజీ జట్లు విజేతలుగా నిలిచాయి. స్థానిక మినీ స్టేడియంలో ఈ నెల 1వ తేదీ ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ మంగళవారంతో ముగిసింది. మంగళవారం ఉదయం జూనియర్ విభాగంలో రెండో సెమీఫైనల్ మ్యాచ్ చీరాల పాలిటెక్నిక్ కాలేజీ–ప్రకాశం పాలిటెక్నిక్ కాలేజీ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం పాలిటెక్నిక్ కాలేజీ జట్టు నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చీరాల పాలిటెక్నిక్ కాలేజీ జట్టు 9 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి రెండో ఫైనల్ జట్టుగా బరిలో నిలిచింది. దీంతో పేస్, చీరాల కాలేజీల జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చీరాల పాలిటెక్నిక్ కాలేజీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేయగా..పేస్ కాలేజీ జట్టు మూడు వికెట్ల కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది.

సీనియర్స్ విభాగంలో పేస్ ఇంజినీరింగ్ కాలేజీ–ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీ జట్ల మధ్య మ్యాచ్ హోరా హోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పేస్ కాలేజీ జట్టు 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఒంగోలు ట్రిపుల్ ఐటీ జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసి ఓటమి పాలైంది. గెలిచిన పేస్ ఇంజినీరింగ్ (సీనియర్స్), పేస్ పాలిటెక్నిక్ (జూనియర్స్) జట్లు త్వరలో జరిగే రీజనల్ స్థాయి సాక్షి ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఉత్తమంగా రాణించేందుకు మంచి వేదిక: కలెక్టర్ దినేష్‌కుమార్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సాక్షి ప్రీమియర్‌లీగ్ వంటి పోటీలు ఒక వేదిక లాంటివని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గెలిచిన జట్లు మరింత మెరుగ్గా రాణించి రీజనల్ స్థాయి పోటీల్లో కూడా విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలన్నారు. వచ్చే ఏడాది మరింతగా నైపుణ్యాలు సాధించి రాణించాలన్నారు. గుంటూరుకు చెందిన రషీద్ కూడా ఇదే విధంగా టోర్నమెంట్‌లలో సత్తా చాటుకుని నేడు అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుంటూ ముందుకు సాగి ఉన్నతస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు కలెక్టర్ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాక్షి ఒంగోలు బ్రాంచ్ యూనిట్ మేనేజర్ పంగులూరి శివన్నారాయణ, బ్యూరో ఇన్‌చార్జి ఎస్.మాధవరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి రవిచంద్ర, సర్క్యులేషన్ ఇన్‌చార్జి పవన్‌కుమార్, యాడ్స్ విభాగం ఒంగోలు ఇన్‌చార్జి శర్మ తదితరులు పాల్గొన్నారు.



జూనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన చీరాల కాలేజీ జట్టు



సీనియర్స్ విభాగంలో రన్నరప్‌గా ఒంగోలు ట్రిపుల్ ఐటీ జట్టు



మ్యాచ్‌లు తిలకిస్తూ యువత కేరింతలు

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ చేరేలా చూడండి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో కలిసి మంగళవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించిన గృహ సారథుల శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గాన్ని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ గృహ సారథులు వచ్చే ఎన్నికల్లో విజయ సారథులై పార్టీని గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు సమష్టి కృషితో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా నియమించిన అర్బన్ జేసీఎస్ కన్వీనర్ మంచా హరికృష్ణ, రూరల్ జేసీఎస్ కన్వీనర్ చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డిని ఎమ్మెల్యే గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లకు పరిచయం చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి వెంకటేశ్వర రెడ్డి, మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కక్షిదారుల సహకారంతో కేసుల పరిష్కారం

- ఈ నెల 11న జాతీయ లోక్ అదాలత్
- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శివకుమార్

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా న్యాయస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఈనెల 11న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల్లో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులను ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు సహకరించాలని న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై విచారణకు ఆదేశం



విద్యార్థి చేతికి కట్టు

ఒంగోలు: స్థానిక తూర్పు క్రిస్టియన్‌పాలెంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ తెలిపారు. హాస్టల్లో 7వ తరగతి చదువుతున్న రితీష్ చేయి విరగడానికి వార్డెనే కారణమంటూ విద్యార్థి, అతని తల్లి కొద్దిరోజుల క్రితం డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తన కుమారుడితోనే కాకుండా విద్యార్థులందరితో అదే విధంగా ప్రవర్తిస్తున్నాడని, తనకు ఫోన్ చేసి వెకిలిగా మాట్లాడటాన్ని భరించలేకపోతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వార్డెన్‌కు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఏఎస్‌డబ్ల్యుఓను విచారణకు ఆదేశించారు. వార్డెన్ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు, వారి బంధువులతో మరింత మర్యాదగా నడుచుకోవాల్సి ఉందన్నారు. అంతే గానీ వారికి ఫోన్ చేసి వెకిలిగా మాట్లాడడం సహించరాని విషయమని, దీనిపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామని డీడీ తెలిపారు. విచారణ నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని డీడీ స్పష్టం చేశారు.

ప్రొఫెసర్ రాజశేఖరరెడ్డికి పీహెచ్‌డీ ప్రదానం



ఒడిశా గవర్నర్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకుంటున్న కందుల రాజశేఖరరెడ్డి

పెద్దారవీడు: రాజస్థాన్ రాష్ట్రంలోని జేజేటీ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం సందర్భంగా ఒడిశా గవర్నర్ గణేషిలాల్, యూజీసీ బోర్డు మెంబర్ ఎస్‌కే యాదవ్ చేతులమీదుగా పెద్దారవీడు మండలం చట్లమిట్ల గ్రామానికి చెందిన కందుల రాజశేఖరరెడ్డి మంగళవారం డాక్టరేట్ అందుకున్నారు. మెకానిక్ ఇండస్ట్రీస్‌లో ఉపయోగించే హీట్ ఎక్స్ఛేంజర్‌లో నానో ఫ్లూయిడ్స్ ఉపయోగించి హీట్ రిమూవల్ రేట్ పెంచడంపై చేసిన పరిశోధనకుగాను ఆయనకు పీహెచ్‌డీ లభించింది. ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం అదే కళాశాలలో మెకానికల్ విభాగాధిపతిగా రాజశేఖరరెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. తనను ప్రోత్సహించిన ఇందిరా కళాశాల యజమాన్యానికి, పరిశోధనకు సహాయం అందించిన డాక్టర్ సీఎస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నీట్ సెక్రటరీ డాక్టర్ శర్మ, మహామండలేశ్వర్‌స్వామి, అర్జున్‌దాస్, మహారాజ్, యూనివర్సిటీ చైర్మన్ వినోద్ టిబెరేవలా తదితరులు పాల్గొన్నారు.

20 కేజీల దుప్పి మాంసం స్వాధీనం

- ముగ్గురు నిందితులపై కేసు నమోదు

రాచర్ల: చుక్కల దుప్పి మాంసంతోపాటు తలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని చోళ్లవీడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. చోళ్లవీడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చుక్కల దుప్పిని వేటాడి మాంసాన్ని తరలిస్తున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. వారు సంఘటన స్థలానికి చేరుకుని చుక్కల దుప్పి తల, 20 కేజీల మాంసంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఈ.కుమార్, దినేష్ కుమార్, ప్రదీప్ కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను నిందితులుగా గుర్తించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జేపీ చెరువు ఫారెస్టు డీఆర్‌ఓ మాధవరావు తెలిపారు.

వేగంగా పెండింగ్ కేసుల దర్యాప్తు

- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- గ్రామీణ ప్రజలకు దిశ యాప్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- చిన్నారులు, మహిళల భద్రతకు కృషి చేయాలి
- మహిళా పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం



మద్దిపాడు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

మద్దిపాడు: పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం ఆమె ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని మద్దిపాడు పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల నమోదు, దర్యాప్తు తీరుపై సిబ్బందిని ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాలు, చోరీలు, పెండింగ్ ట్రయల్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్లు, కోర్టు కేసుల రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. శాంతి భద్రతల పరిస్థితి, ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల గురించి ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు నివారించడంపై దృష్టి కేంద్రీకరించాలని, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించాలని చెప్పారు. ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు.

దిశ యాప్ రిజిస్ట్రేషన్, గ్రామాల్లో కొత్త వ్యక్తుల వివరాలు సేకరించడంతోపాటు ప్రైవేట్ వ్యక్తులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంపై దృష్టి సారించాలని మహిళా పోలీసులకు సూచించారు. రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు సైబర్ నేరాలు, ఉద్యోగం పేరుతో చేసే మోసాలు, ఎల్ఎహెచ్ఎంఎస్ యాప్, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. బాల్య వివాహాలు, మహిళలు, చిన్నపిల్లల పట్ల జరిగే నేరాలపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవ్వాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో విడివిడిగా మాట్లాడి ఉద్యోగ, వ్యక్తిగత వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ జవాబుదారీతనంగా ఉండాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ ‘సాక్షి’తో మాట్లాడుతూ.. మద్దిపాడు ప్రాంతంలో జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగేవని, ఇటీవల చేపట్టిన చర్యలతో సగానికి పైగా ప్రమాదాలను నివారించగలిగామన్నారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. బైకర్లు హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పిస్తూ ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టనున్నామన్నారు. ముందుగా మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్పీకి డీఎస్పీ యు.నాగరాజు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, సీఐ ఆర్.రాంబాబు, మద్దిపాడు ఎస్సై శ్రీరామ్, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అక్క హత్య కేసులో తమ్ముడికి యావజ్జీవ శిక్ష

ఒంగోలు: తోడబుట్టిన అక్కను హత్య చేసిన కేసులో నిందితునికి యావజ్జీవ శిక్ష విధిస్తూ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి.అమ్మన్నరాజా మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఒంగోలు మండలం గుండాయపాలెం గ్రామానికి చెందిన గొల్లపోతు కృష్ణ కుమార్తెను అతని అక్క వలేటి వెంకటేశ్వరమ్మ కుమారునికి ఇచ్చి వివాహం చేశారు. అయితే భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో కృష్ణ కుమార్తె ఒంగోలు మహిళా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు పరిష్కారం కాకపోగా ఇద్దరి మధ్య వివాదం మరింత పెరిగింది. దీంతో తన కుమార్తెకు, అల్లుడికి మధ్య విభేదాలు రావడానికి అక్కే కారణమని గొల్లపోతు కృష్ణ భావించాడు. ఈ క్రమంలో 2016 జనవరి 17న తన అక్క వలేటివారిపాలెంలో రొయ్యలు అమ్ముకుని ఒంగోలుకు నడుచుకుంటూ వెళ్తున్నట్లు తెలుసుకున్న కృష్ణ ఆమెను వెంబడించి మార్గమధ్యంలో నైలాన్ తాడును మెడకు బిగించి హత్య చేశాడు. తల్లి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుమార్తె విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తాలూకా ఎస్సై నజీర్‌బాషా కేసు నమోదు చేయగా సీఐ ఆంటోనీరాజ్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ నిందితుడు గొల్లపోతు కృష్ణకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చావలి రమేష్‌బాబు వాదించారు.

పోలీసులకు ఎస్పీ అభినందన

ఒంగోలు టౌన్: గుండాయపాలెం గ్రామానికి చెందిన వలేటి వెంకటేశ్వరమ్మ(50) హత్య కేసులో నేరారోపణలు రుజువు కావడంతో నిందితుడు గొల్లపోతు కృష్ణకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం మంగళవారం తీర్పు ఇచ్చింది. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా నిందితుడికి శిక్ష పడటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన అప్పటి తాలుకా సీఐ ఆంటోని రాజ్, ఎస్సై నజీర్, కోర్టు లైజన్ ఏఎస్సై బి.సత్య శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుల్ ఎస్‌డీ సద్దాంను ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

జీజీహెచ్‌లో పటిష్ట భద్రతా చర్యలు

- సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు అర్బన్: ఒంగోలు జీజీహెచ్ ఆవరణలో అనాథ వృద్ధుడి మృతదేహాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంపై ‘పెద్దాసుపత్రిలో పర్యవేక్షణ కరువు’ శీర్షికతో మంగళవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ స్పందించారు. సంబంధిత సిబ్బందిపై తక్షణ చర్యలకు ఉపక్రమించారు. జీజీహెచ్‌లో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఆస్పత్రి ఆవరణలోకి అనధికార, అపరచిత వ్యక్తులు ఎవరినీ అనుమతించకుండా చూడాలని భద్రతా సిబ్బందిని ఆదేశించామన్నారు. ఆస్పత్రి ఆవరణలోని బ్లైండ్ స్పాట్లలో రాత్రి వేళ అదనపు లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. విధి నిర్వహణలో ఎవరు అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

310 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల అదుపులో రేషన్ బియ్యం లారీ

పీసీపల్లి: అక్రమంగా తరలిస్తున్న 310 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం పీసీపల్లి మండలంలోని పెదఅలవలపాడు రామాపురం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. మార్కాపురం నుంచి కావలికి అక్రమంగా 310 రేషన్ బియ్యం బస్తాలను లారీలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో పెదఅలవలపాడు రామాపురం వద్ద లారీ టైరు పంక్చరైంది. బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్, పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని పరిశీలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పీసీపల్లి ఎస్సై నాగేశ్వరరావుకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దాడిలో విజిలెన్స్ సీఐ సుబ్బారావు, ఎస్సై వెంగల్‌రెడ్డి, డీసీపీఓ రామారావు, హెచ్ఎం హెచ్‌సీ రవికుమార్, డీటీ అనిల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

- ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

చినగంజాం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుంటూరు, కృష్ణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టీ కల్పలతారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం చినగంజాం మండలంలోని చినగంజాం, పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ఇంకొల్లు మండలం జెడ్పీ ఉన్నతపాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టో తయారు చేసుకొని ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. సర్వీసు రూల్స్ మీద ప్రధానంగా దృష్టి పెట్టామని, ఎంఈవోల ప్రమోషన్లపై ప్రత్యేకంగా కృషి చేశామని పేర్కొన్నారు. కృష్ణ, గుంటూరు జిల్లాలతో పాటు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో పాఠశాలలో కూడా పర్యటించి పాఠశాలలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తను కేవలం పదవీ కోసం ఎమ్మెల్సీ కాలేదని పాఠశాలలు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి సేవ చేయాలన్న ధ్యేయంతోనే ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. నెల్లూరు, రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకులు కే జాలిరెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షులు బొజ్జా సురేష్, ప్రధాన కార్యదర్శి దండమూడి శాంతారావు, ప్రకాశం జిల్లా నాయకులు జీ వెంకటేశ్వరరెడ్డి, పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ వి హరికృష్ణ, ఒంగోలు నియోజక వర్గ ఇన్‌చార్జ్ సీహెచ్ శిరీష, ప్రసాద్‌రెడ్డి, చినగంజాం, పెదగంజాం పాఠశాలల హెచ్ఎం డీ రత్నకుమారి, ఎం దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.

98 డీఎస్సీ అభ్యర్థులకు త్వరలోనే పోస్టింగ్

98 డీఎస్సీ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు సాధించిపెట్టాలన్న ధ్యేయంతో ఇప్పటి వరకు తీవ్రంగా కృషి చేశామని, సీఎం దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి అభ్యర్థుల వెబ్ నమోదు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి చర్యలు చేపట్టామని కల్పలతారెడ్డి అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు రావడంతోపాటు కేబినెట్ సమావేశం అనంతరం రెండు మూడు రోజుల్లో జీఓను సైతం విడుదల చేయనున్నట్లు ఆమె తెలిపారు.

షెడ్యూల్ తెగల అభ్యున్నతికి సర్కారు కృషి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు



ఎస్టీల సమస్యలను వింటున్న రవిబాబు

గిద్దలూరు రూరల్: ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కె.రవిబాబు అన్నారు. మండలంలోని దిగువమెట్ట గ్రామ పరిధిలోని చెంచుకాలనీ, ఎరుకల కాలనీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అనంతరం దిగువమెట్ట తండా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీలకు సంబంధించిన సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కాలనీల్లో పర్యటిస్తున్నామన్నారు. ఎస్టీలకు ప్రభుత్వం నుంచి పథకాలు సక్రమంగా అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చేయూత కింద కిరాణా షాపు యజమానిని వ్యాపార లావాదేవీల గురించి రవిబాబు అడిగి తెలుసుకున్నారు. బుట్టల అల్లకంతో ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. వారు నివాసం ఉండే ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. చెంచు కాలనీలోని ఐటీడీ పాఠశాలలో కేవలం 8 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. చెంచుకాలనీలో 72 మంది పిల్లలకు గాను 8 మంది మాత్రమే రావడంపై మండిపడ్డారు. విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డులు లేకపోవడంపై అధికారుల పనితీరును ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. తమకు జీవనాధారమైన బుట్టల అల్లికల కోసం అడవిలోకి వెళ్లేందుకు అనుమతులు ఇప్పించాలని, పక్కా గృహాలు ఏర్పాటు చేయాలని, సాగు చేసుకునేందుకు పొలం ఇప్పించాలని కోరారు. దిగువమెట్ట రైల్వేస్టేషన్ సమీపంలోని ఎరుకల కాలనీవాసులు కరెంట్ పోతే తామే చందాలు వేసుకొని బాగు చేయించుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఎస్టీల సమస్యలపై ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జగన్నాథరావు, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరీ కమిటీ సభ్యుడు పెరిక జయరావు, హౌసింగ్ ఈఈ ఎస్‌వీ స్వామి, ఎంఈఓ నరసింహారావు, సీఐ ఫిరోజ్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో పట్టపగలు చోరీ

- రూ.2.50 లక్షల విలువైన సొత్తు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలు సుమారు ఒంటి గంట సమయంలో బీరువాలోని రూ.1.25 లక్షల నగదు, 3 సవర్ల బంగారం చోరీ అయిన సంఘటన మంగళవారం బైరాగిమాన్యం 3వ లైనులో పాత పోస్టాఫీసు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ శంషాద్‌బేగం తన పాపతో బైరాగిమాన్యం 3వ లైనులో నివాసం ఉంటోంది. ఆమె భర్త దుబాయ్‌లో పనిచేస్తున్నారు. రోజులాగే శంషాద్‌బేగం స్కూల్లో చదువుతున్న పాపకు మధ్యాహ్నం 12 గంటల సమయంలో భోజనం తీసుకెళ్లి అక్కడ నుంచి ఈద్గామిట్ట ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న కొత్త ఇంటి వద్దకు వెళ్లింది. తరువాత ఇంటికి వచ్చేసరికి తాళం తీసి ఉండటంతోపాటు బీరువా కూడా తెరిచి ఉంది. బీరువాలో ఉంచిన రూ.1.25 లక్షల నగదు, 3 సవర్ల బంగారం గొలుసు చోరీ అయ్యాయని నిర్ధారించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమా పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి వేలు ముద్రలు సేకరించారు. ఈ చోరీకి సంబంధించి పలు అనుమానాలు ఉన్నాయని, రెండు రోజుల్లో ఛేదిస్తామని సీఐ రంగనాథ్ చెప్పారు. ఆయన వెంట ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతుడు కౌశిక్(ఫైల్)

కొత్తపట్నం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. కొత్తపట్నం మండలం ఈతముక్కల ఎస్సీ కాలనీకి చెందిన కట్ల కౌశిక్(20) ఏకేవీకేలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పని మీద తన స్నేహితుడు మన్నెం సాయికృష్ణతో కలిసి సోమవారం సాయంత్రం బైక్‌పై ఈతముక్కల నుంచి ఒంగోలు వెళ్తున్నారు. ఈ క్రమంలో సూరారెడ్డిపాలెం సమీపంలోని చప్టా వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కౌశిక్ తలకు బలమైన గాయాలు కాగా సాయికృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కొద్ది సేపటికి సాయికృష్ణ 108కు కాల్ చేయడంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కౌశిక్ మృతి చెందాడు. టంగుటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్‌పై అనుమానం?

సూరారెడ్డిపాలెం నుంచి రొయ్యల హేచరీలకు టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. వేగంగా వెళ్తున్న టిప్పర్ తన కుమారుడిని ఢీకొట్టి ఉంటుందని మృతుడు కౌశిక్ తల్లిదండ్రులు కట్ల గోవిందరావు, మరియమ్మ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను శిక్షించి, తమకు న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.